క్లుప్తంగా

నేటి నుంచి వార్షికోత్సవాలు



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సూర్యదేవాలయ ఎనిమిదో వార్షికోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం బస్సుల సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని వివరించారు. మొదటి రోజు సూర్యనారాయణ స్వామి విగ్రహాల ఉత్సవ ఊరేగింపు, అభిషేకం, మలయాల స్వామి విశ్వశాంతి మహాయజ్ఞం, ఆదిత్య పారాయణం, సూర్యాష్టోత్తర శతనామావళి, పూర్ణాహుతి, రెండో రోజు స్వామి వారి పారాయణం, భగవద్గీత ద్వితీయ షట్కపారాయణం, సూర్యనారాయణ కల్యాణం, ఎడ్లబండ్ల ఊరేగింపు, మూడోరోజు భగవద్గీత తృతీయ షట్క పారాయణం, సామూహిక వ్రతాలు, సభా కార్యక్రమం, సందేశములు అనంతరం భజనపోటీలు ఉంటాయని వివరించారు.

రోగులకు పండ్లు పంపిణీ

మన్ననూర్: అమ్రాబాద్ మాజీ మండల అధ్యక్షుడు మంగళగిరి శంకర్‌జీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, సీనియర్ నాయకులు పులిజాల శేఖర్, సంబు శ్రీను, గంగాజీ, మల్లాజీ, బాలకృష్ణ, వాల్యానాయక్, రమేష్, శ్రీకాంత్, బాల్‌నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంపై స్పష్టమైన ప్రకటన చేయాలి



కొల్లాపూర్: రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచే సన్నబియ్యం ఇస్తామని గతేడాది సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ప్రకటించారన్నారు. నెలరోజులు దాటినా ఇప్పటివరకు సన్నబియ్యం జాడ లేదన్నారు. ఇచ్చిన మాటప్రకారం రేషన్‌కార్డు లబ్ధిదారులతో పాటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, గురుకులాలు, వసతిగృహాలన్నింటికీ సన్నబియ్యం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శీలం వెంకటేష్, కురుమయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మీయ భరోసాపై ఆంక్షలు సరికాదు



కొల్లాపూర్: జాబ్‌కార్డు సంబంధం లేకుండా ప్రతి కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు జల్లాపురం సురేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముక్కిడిగుండంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంక్షలు ఎత్తివేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గ్రామ అధ్యక్షుడు వర్తే గణేష్, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సహాయ కార్యదర్శిగా రాముడు, సభ్యులుగా సేవ్యానాయక్, శ్రీను, శంకర్, గుడిసె కురుమయ్యలను ఎన్నుకున్నారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్, నాయకులు హరియా బోజ్యా, గంట వెంకటస్వామి, వెంకట్రాములు, శంకర్, కురుమయ్య ఉన్నారు.

కరాటే మాస్టర్‌కు జడ్జి అభినందన

కల్వకుర్తి టౌన్: కరాటేతో ఆత్మరక్షణ సాధ్యమని హైకోర్టు జడ్జి వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కరాటే మాస్టర్ల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరాటేలో కల్వకుర్తికి చెందిన మాస్టర్ వెంకటేష్‌ను జడ్జి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పంచాయతీల్లో నిధుల లేమి!

- నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్స్
- పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి



తాడూరు గ్రామ పంచాయతీ



లీకేజీ అయి రోడ్డుపై పారుతున్న మిషన్ భగీరథ నీరు

తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో పల్లెలు ప్రగతికి నోచుకోవడం లేదు. గ్రామాల అభివృద్ధికి అత్యధికంగా నిధులు ఇస్తున్నామని పాలకుల హామీలు ఉపన్యాసాలకే పరిమితం అయ్యాయి. పంచాయతీల్లో పనులు చేసేందుకు కూడా నిధులు కరువయ్యాయి. కనీస వసతులు కల్పించడంలో నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిపోయి, ప్రత్యేక అధికారులు రావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిధుల లేక, పనులు చేయించలేక పంచాయతీ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొత్తగా పంచాయతీలుగా ఏర్పడిన తండాల్లో అయితే ట్రాక్టర్ కిస్తీలు కట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. మండలంలోని 24 పంచాయతీల్లో 1, 2 పంచాయతీలు మినహా అన్ని గ్రామాల్లో నిధుల కొరత ఏర్పడింది. మండలంలో రెండు, మూడు గ్రామాలు మాత్రమే ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ఇప్పటివరకు నెట్టుకొచ్చారు. 6 నెలల నుంచి కేంద్రం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకపోవడంతో దయనీయపరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా అయితే గత ప్రభుత్వ హయాంలోనే నిలిపివేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తి అయిన ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు ఏడాది నుంచి రావడం లేదు. దీంతో ఏం చేయాలో పాలు పోని స్థితిలో అధికారులు కొటుమిట్టాడుతున్నారు. సర్పంచ్‌లు వారి పదవి కాలంలో అప్పులు తెచ్చి మరి అభివృద్ధి పనులు చేయించారు. అవి ఇప్పటి వరకు మంజూరు కాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలవారీ బిల్లులకు ..

పంచాయతీలో ప్రతి నెల పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు, ట్రాక్టర్ల కిస్తీలు, విద్యుత్ దీపాల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, తాగునీటి పైపుల మరమ్మతులు తదితర పనులకు కచ్చితంగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలంలో దాదాపు 3 వంతుల పంచాయతీల్లో సాధారణ నిధులు రూ.10 వేలు లేకపోవడంతో సదరు బిల్లులు చెల్లించలేక చేతులు ఎత్తేశారు.

బ్లీచింగ్‌కు ఇబ్బందులు

వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచాయతీల్లో చిల్లి గవ్వ కూడా లేదు. కొన్ని గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లే బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పటికీ చిన్న చిన్న పనులు వారే చేయిస్తున్నారు. మరోవైపు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టి కనీసం గ్రామాల వైపు తిరిగి చూడడం లేదు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సాధించడం లేదు.

బిల్లులు రాలేదు



గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశాం. పల్లె పకృతి, రైతు వేదిక నిర్మాణం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డుల పనులు చేశారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైనా నిధులు విడుదల చేయలేదు. ఇప్పటికీ 50 శాతం బిల్లులు అందలేదు.

–గుంటి నిరంజన్, మాజీ సర్పంచ్, అల్లాపూర్

పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం

గ్రామాలను రోజువారిగా పరిశీలిస్తున్నాం. ఉన్నటువంటి నిధులతో విడుతల వారిగా సమస్యలను పరిష్కరిస్తున్నాం. నిధుల కొరత ఉన్నది వాస్తవమే. కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం.

– బ్రహ్మచారి, ఎంపీడీఓ

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలమైన బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. సామాన్య ప్రజలను పూర్తిగా విస్మరించారన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి తెలంగాణకు సాధించిందేమీ లేదన్నారు. విభజన హామీలను సాధించడంలో తెలంగాణ ఎంపీలు విఫలం అయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు సలీం, రాజు, మధు, సాయికుమార్ తదితరులు ఉన్నారు.



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

తెలంగాణకు అన్యాయం

పెంట్లవెల్లి: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బయ్యారం ఐరన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుక జాతీయ హోదా, సైనిక్, నవోదయ స్కూల్స్ ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకుడు గోపాల్, కుమార్, రవి తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

కల్వకుర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి, రైతుల, ఉపాధి కూలీలకు అన్యాయం చేకూరేవిధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సాహించే విధంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు. నాయకులు మల్లయ్య, పరశురాముడు, బాల్‌రెడ్డి, కిశోర్, కురుమయ్య, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

తైక్వాండోతో ఆత్మవిశ్వాసం



కందనూలు: తైక్వాండోతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తైక్వాండో జిల్లా అధ్యక్షుడు తెప్ప శ్రీను అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. పంచెస్, బ్లాక్స్, కిక్స్, ఫుంసె, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బెల్ట్‌లు ప్రదానం చేశారు. సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. జనరల్ సెక్రటరీ రవికుమార్, జిల్లా ట్రెజరర్ మాస్టర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం నాలుగు వేల మంది భక్తులు హాజరయ్యారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు పూజలు చేశారు. భక్తుల సంఖ్య తగ్గిపోవడంతో ఆర్టీసీ వారికి ఆదాయం తగ్గింది.



మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశానుసారం సోమవారం నుంచి మండలంలో మిషన్ మధుమేహ (షుగర్) వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్ల పైబడిన వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.26 లక్షలు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. ఎస్సీ కాలనీలో సరైన రోడ్డు వసతి లేక కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద డబ్బులను మంజూరు చేయించారని, సీసీ రోడ్లతో పాటు డ్రైయినేజీలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి గ్రామ ంలోని పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

మన్ననూర్: అచ్చంపేట డివిజన్ మాల మహానాడు అధ్యక్షుడు కల్ములల బాలస్వామిపై దాడి చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు మద్దెల దివాకర్ డిమాండ్ చేశారు. పదర మండల కేంద్రానికి చెందిన బాలస్వామి వృత్తి రిత్యా కుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంగా అచ్చంపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. దుండగులు ఓ ప్రత్యేక వాహనంలో వచ్చి ఇంట్లో ఉన్న బాలస్వామి ఆయన భార్యపై కర్రలతో దాడి చేయడం విచారకరం. ఒక దశలో వారిని హత్యా చేసేందుకు ప్రయత్నించినట్లు ఆయన ఆరోపించారు. సమీప కుటుంబాల వారు అడ్డు రావడంతో దుండగులు తప్పించుకు పారిపోయారన్నారు. సంఘటనపై పోలీస్ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి బాలస్వామి కుటుంబానికి రక్షణ కల్పించాని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడూరు: మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాలలోని 1991–92బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. అంతకుముందు వసంత పంచమి సందర్భంగా సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లచ్చిరెడ్డి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బాల్‌రాం గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

కొట్రలో మెగా వైద్య శిబిరం



వెల్దండ: మండలంలోని కొట్రలో మెట్రో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్‌రెడ్డి, రాకేష్‌గౌడు, రమేష్‌గౌడు, శ్రీకాంత్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

తెలకపల్లి: మండలంలోని గట్టురియి పాకులలో యోగి వేమన జయంతిని పురస్కరించుకొని వేమన పద్యాల గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్ అచ్చంపేట కమిటీ సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మనోహనర్, సాయి శంకర్, షష్టి, వెంకటయ్య, తిరుపతి, నిరంజన్, రాము, యాదగిరి, రమాదేవి, మంజుల, చంద్రకళ, శిరిష, వెంకటమ్మ పాల్గొన్నారు.



రేపటి నుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పర్వదినాన్ని పురష్కరించుకొని ఈ నెల 4వ తేదీ మంగళవారం నుంచి రెండు రోజులపాటు అలివేలుమంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు.

మొదటి రోజు కల్యాణోత్సవం

ఉదయం 5.30 గంటలకు ధ్వజారోహనం, 10 గంటలకు శేషవాహన సేవ, మధ్యాహ్నం 12.30 గంటలకు అశ్వవాహన సేవ, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం భక్త బృందం భజన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.

రెండో రోజు రథోత్సవం

ఉత్సవాల్లో రెండో రోజు ఫిబ్రవరి 5వ తేదీన బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు కుంకుమార్చన, రాత్రి 9.30 గంటలకు ప్రసాద వితరణ ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తెలకపల్లిలో..

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ సభ్యులు రాజయ్య, లక్ష్మణస్వామి తెలిపారు. సోమవారం



కొలువుదీరిన అలివేలుమంగ సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి

ఉదయం స్వామివారి కల్యాణోత్సవం, మంగళవారం రథోత్సవం, బుధవారం దీపోత్సవం ఉంటుందని వివరించారు. ఈ నెల 12 వరకు బహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. నూతన దేవాలయ సింహ ద్వారా ప్రతిష్ఠాపన ఉంటుందని భక్తులు తరలి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సాయి లింగేశ్వర దేవాలయంలో..

మండల కేంద్రంలో 4వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సాయిలింగేశ్వర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తునట్లు వేద పండితులు, గంటమటం నాగబూషనయ్య తెలిపారు. 4న ఉదయం నుంచి సాయంత్రం హోమం, స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి అగ్నిగుండ మహోత్సవానికి పూజ, 5న అగ్నిగుండంలో నడుచుట, అన్నదానం ఉంటుందని వివరించారు.

రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలి

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి రూరల్: క్రీడాపోటీలలో ఉన్నతంగా రాణించి మన రాష్ట్రానికి మంచిపేరు తీసుకొని రావాలని రాష్ట్ర ఒలంపిక్ జాయింట్ సెక్రటరీ బాబులాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో కబడ్డీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టుకు ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా తరపున ఎన్నికైన కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు ఒలంపిక్ సంఘం తరపున ఎప్పటికి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన తెలిపారు. కబడ్డీలో జిల్లాస్థాయిలో ఉత్తమ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 4, 5, 6, 7 ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఉస్మానియా యూనివర్సిటీ కోచ్ గణేష్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో బాబులాల్, పీఈటీలు

ఎంపీటీసీ స్థానం యథావిధిగా కొనసాగించాలి

కొల్లాపూర్: రామాపురం గ్రామ ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. రామాపురం ఎంపీటీసీ స్థానంలో మార్పులు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం మార్పులు చేసేందుకు యత్నిస్తోందని వివరించారు. సమావేశంలో నాయకులు నిరంజన్, కొమ్ము గోపాల్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, గడ్డం శ్రీరాములు, నరేష్, శరబంద, రమేష్, మల్లేష్, సాయిప్రకాష్ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాంద్రకు చెందిన దివ్యాంగుడు వెంకటయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం గ్రామానికి చెందిన గోలి సురేందర్ రెడ్డి బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాలస్వామి, వెంకటయ్య, యాదయ్య, పుల్లయ్య, ఆనంద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని సంజాపూర్‌కు చెందిన పర్వతాలుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.40 వేల చెక్కును కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో కేసులు నమోదు

లింగాల: మండలంలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి–యాపట్ల మధ్య వాహనాలు తనఖీ చేయగా మద్యం తాగి పట్టుబడినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచే పాన్‌గల్ ఈదమ్మ జాతర



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ జాతర మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పూజరి నాగన్న ఆదివారం తెలిపారు. అమ్మవారి జాతర రెండు రోజుల పాటు జరుగుతుందని మొదటి రోజు షిడే, రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతరకు మండలంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి గుడి వద్ద పలు మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



తాడూరు: మండలంలోని ఐతోలు పాఠశాలలో ఆన్‌లైన్ వేదిక నిర్వహించిన జీకే పోటీలలో గెలుపొందిన విజేతలకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్, సభ్యులు రాజయ్య, పరమేశ్వర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం

లింగాల: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం చేకూరుతుందని డప్పు కళాకారుల మండల గౌరవ అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బంగారయ్య అన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమంపై ఆదివారం కళాకారులు ఆటపాటలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగా సభకు మాదిగలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభకు సంబంధించి కరపత్రాలు, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల జిల్లా ఉపాధ్యక్షుడు భీముడు సతీష్, రామస్వామి, బాలు, రేణుబాబు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

ఊర్కొండ: ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పుల వేలగొంతుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు వాల్ పోస్టర్ విడుదల చేశారు. నాయకులు రాజు, మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, కొమ్ము రాజయ్య, వీరస్వామి, కొమ్ము శీను, రవి, లక్ష్మణ్, కళాకారుల మండల అధ్యక్షులు పరమేష్, పరశురామ్, చెన్నయ్య, జగన్, తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దండోరా నాయకులు

కొల్లాపూర్: మండలంలోని సింగోటం, ఎన్మన్‌బెట్ల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ సాంస్కృతిక ప్రదర్శన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. లక్ష డప్పులు–వేల గొంతులు పేరిట నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బచ్చలకూర లక్ష్మణ్‌మాదిగ కోరారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగే ఈ ప్రదర్శన ద్వారా మాదిగల ఐక్యత చాటాల్సిన అవసరం ఉందన్నారు. కోళ్ల నర్సింహ, ఎల్లపోగు వెంకటస్వామి, మద్దిలేటి, చందు, రాముడు, రాజు, సాయికుమార్, శివ, భాస్కర్ పాల్గొన్నారు.